55913
శ్రీకాకుళం

ఏమైనాసరే నే కథ రాయాలి

"ఏమైనాసరే నే కథ రాయాలి."

లేకపోతే లాభం లేదు.బొత్తిగా అన్యాయంగా వుంది.

నిన్న మొన్నటి కిష్టిగాడు "చూసుకో నేనో కథ రాసా"నంటూ తీసుకువస్తాడూ!వేలెడంత లేదు వీరిగాడుకూడా ఒక వస్తాదా? స్కూలుఫైనలు మూడో దండయాత్రకి సిద్ధంగా వున్న వెంచయ్యకూడా ఓ కథకుడే!

ఆఖరికి సుధ-నిన్నమొన్నటిదాకా "వొదినా, టయిమెంత?"అంటూ "ట" కూడ సరిగ్గా పలకలేకుండా అఘోరించిన సుధకి-కథలపోటీలో బహుమతా?రామ రామ!

వీళ్లంతా ఈ కథా ప్రపంచంలో హేమాహేమీలుగా చలామణీ అయిపోతూంటే, వీళ్లకంటే జాస్తో కూస్తో నోట్లో ముక్కవున్నదాన్ని, దాదాపు అర్ధ శతాబ్దం సీనియర్‌ని, బి.ఎ.చదువుతూ ఝూంమ్మని ఇంగ్లీషు, తెలుగు రెండింటిలోనూ ఫస్ట్ మార్కు తెచ్చుకుంటూ,ఉభయభాషా ప్రవీణగా, ఉభయ ఉపన్యాసకులద్వారా మెప్పుపొందుతున్నదాన్ని, నేను ఏమీ చేతగానిదానిలాగ చేతులు ముడుచుకుని కూచోడమా?అదేదో మహావిద్య అయినట్లు వాళ్లకేసి చేతకానివాళ్లంతా ఆశ్చర్యంగా చూస్తుంటే, నేను కూడా నోరు వెళ్లబెట్టుకుని చూడడమా?

ఛ..ఛ...ఇదేం బాగోలేదు.

భోజనం చేస్తున్నంతసేపు నా మెదడులో ఎన్నోఆలోచనలు ఈగల్లాగా ముసరసాగాయి.అమ్మమ్మ అరిచిన తర్వాత ఇంక కథ ముందుకు సాగలేదు. సరే, బాగానే ఉందయ్యా-అంతకుముందు ఏం సాగినట్టు?అరవై నిముషాలకి పైగా కుర్చీకి అతుక్కుని కూచున్నానుకదా.ఒక్క అంగుళం అంటే అంగుళం ముందుకు సాగిందా కథ? ...నిజమే ...మరి చకచకా కథ సాగాలంటే ఎలా?...నల్లేరు మీద బండిలా కథ నడిచిపోవాలంటే ఏం చెయ్యాలి?

ఆ! కథ రాయడానికి ముఖ్యమైన ఆటంకాలు బాహిరమైనవి కావు. ఏవో అంతరమైన కారణాల వల్లే కథ గంతులేస్తూ పరిగెట్టలేకపోతోంది.అలాంటివి నాలో ఏం ఉన్నాయి

చెప్మా!నాలో ఏం లోపం వల్ల కథ నడవడం లేదు!ఆ...నా మొహం-నాలో ఏం లోపం వుంది?తక్కిన కథకులకు నేనేం తీసిపోయాను!

ఇలా అనుకుంటూ నాకు తెలిసిన మీనాక్షిలాంటి ఒకళ్లిద్దరు ప్రసిద్ధ కవులను జ్ఞప్తికి తెచ్చుకున్నా.

ఆ...అర్ధం అయింది.వాళ్లంతా ఏదో ఊహాలోకంలో తేలిపోతూవుంటారు.ఏ చిన్నసంఘటన చూసినా, ఏ అందమైన సంగతి విన్నా, ఆహా, ఓహోఅంటూ తెగ తబ్బిబ్బు అయిపోతూ వుంటారు.నేను కూడా అలా అవుతూఉండాలి.

ఓ మోస్తరు ఉదాసీనత, ఓ చిన్నసైజు పరధ్యానం నేను కూడా ప్రారంభించాలి. అసలు ప్రపంచ విషయాల్లో పరధ్యానం తెచ్చుకుంటేనేగాని కావ్య ప్రపంచంలో పరాకాష్టనందుకోలేరుట.అన్నట్టు ఈ పరధ్యానంతోపాటు కొంచెం ప్రకృతిలో తన్మయం అవడం కూడా నేర్చుకోవాలి.

అమ్మమ్మకు బాగా కునుకుపట్టిందని నమ్మకం కుదిరాక రాత్రి బాగా పది దాటాక తలుపులు బార్లా తీసి, లోపల పడుతున్న వెన్నెలని చూస్తూ ఆనందించసాగాను.

హమ్మయ్య!

నిశ్శబ్దంతో పాటు ప్రకృతిసౌందర్యం కూడా లభించింది.ఇంక తప్పకుండా కథ రాసేయొచ్చు.

బ్రహ్మాండమైన కథ!

లోకం అంతా ఓహో అనే కథ!

మీనాక్షి, కామాక్షి వాళ్లంతాచూసి పైకి మెచ్చుకోకపోయినా లోపల్లోపల ఈర్ష్యపడే కథ!

రైట్- కథ ఇలా ప్రారంభించవచ్చు.

"బయట వెన్నెల కాస్తోంది" వెన్నెల్లో అందమైన పువ్వులుంటే బాగుండును.ఆ...!

"సన్నజాజి, మల్లె, చామంతి, బంతి"

ఏడిసినట్టుంది.మల్లె వేసవికాలంలో వస్తుంది.బంతి సంక్రాంతికి విడుస్తుంది.తక్కినవి ...అందువల్ల కథల్లో పువ్వుల ప్రస్తావన చెయ్యడం అంత తేలికైన పనికాదు.అందువల్ల ఆ పంక్తి కొట్టెయ్యాలి.-పోనీ.

"బాలభానుడు అస్తాద్రిని చేరుచున్నాడు" అని వర్ణిస్తే?

అవును అది బాగుంది. కాని-'వెన్నెల కాస్తున్నప్పుడు సూర్యాస్తమయం ఏంటి

పిచ్చికన్నా?'అనిఎవరైనా అంటే?ఛట్. బాగోలేదు. వెన్నెలైనా కాయాలి, బాలభానుని ఎండైనా కాయాలి.
ఆ..కాయాలంటే జ్ఞాపకం వచ్చింది."రంగడికి జామకాయలంటే ప్రీతి"
పోనీ ఇలా మొదలెడితే?కథ ఫస్టుగా వుంటుంది.కాని తర్వాత?తర్వాత ఏం రాయాలి?
ఏమిటో నామొహం?ఇలా తర్కించుకుంటూపోతే కథేం నడుస్తుంది.అలా రాసుకుపోవాలి గాని.తెల్లని కొంగలు బారులుబారులుగా ఆకాశంలో ఎగురుతున్నాయి. చల్లని పిల్లతెమ్మెరలు హాయిగా వీస్తున్నాయి.ఎదురుగా గోదావరి అభిసారికలా నడుస్తూ...
"అమ్మో!నావేపుఎవరో నడుస్తూ వస్తున్నారు."అంటూ గట్టిగా అరిచి రెండు చేతుల్తోటీ కళ్ళు మూసుకున్నాను.
నిద్దట్లోంచి కంగారుగా లేచి అమ్మమ్మ కర్ర తీసుకుని నాకెదురుగా బార్లా తీసివున్న వీధిగుమ్మం దగ్గరకి వచ్చింది. ఉన్నట్టుండి గట్టిగా నవ్వి "తెలివి తెల్లారినట్లే ఉంది. ఎవరిదో గేదె,తాడు తెంపుకుని వచ్చింది.దాన్ని చూసా ఈ భయం?అసలీ అర్ధరాత్రివేళ తలుపులు తీసుకుని నిన్నెవరు కూర్చోమన్నారు?లైటు ఆర్పేసి పడుకో" అంటూ ఓ కసురు కసిరి, తనే తలుపులేసేసి లైటు ఆర్పేసి వెళ్లిపోయింది.
నా తలపుల తలుపులు మూసేసినట్టూ, నా కథా రచనాజ్యోతిని ఆర్పేసినట్టూ బాధపడ్డాను.కిటికీలోంచి పడుతున్న వెన్నెలలోకి బిక్కమొహం వేసుకుని చూస్తూ, నేను రాయబోయే కథ గురించి తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటే ఎప్పుడు పట్టేసిందో గాఢంగా పట్టేసింది నిద్దర.
"ప్రారంభించి పరిత్యజింతురు విఘ్నాయత్తులై మధ్యముల్"అన్నట్లు, తర్వాత ఓ నెల దాకా కథ రాసే ప్రయత్నమే మానేశా.ఆ మానెయ్యడం మానెయ్యడం పూర్తిగా మానేద్దును.కాని ఇంతలోనే సీత నాలో ఈ చైతన్యాన్ని కల్పించింది.
కాలేజీ మేగజైన్ బోర్డులో మెంబరయింది. మేగజైన్ ఎడ్వయిజరుగా ఉన్న వైస్‌ప్రిన్సిపాల్‌కి సీత ఎంత చెబితే అంత. అందుకే "నువ్వో కథ రాయి.మేగజైన్‌లో వేయించే పూచీ నాది" అంది.పైగా "వాళ్లంతా రెండు కథలూ ఇచ్చేసారు."అంది.
"ఏమిటి అప్పుడే రాయడం ఇచ్చేయడం కూడా అయిపోయిందీ?...అవున్లే -ఛాన్సు ఎప్పుడు దొరుకుతుందా అని కూర్చున్నవాళ్లు రాసెయ్యరూ మరీ...ఊ..ఇంతకీ వాళ్ల కథల పేర్లేమిటీ?"అన్నా.

"ఒకటి మధుహృది కాబోలు-రెండోదేమో వ్యధానిధి అనుకుంటా"అంది సీత.
"అద్గదీ-అలా చెప్పు.శీర్షికలో ధ అనేఅక్షరం విధిగా రావాలన్నమాట!శీర్షిక నాలుగక్షరాల్లో కూడా ఉండాలన్నమాట...ఇకనేం?వాళ్ల రహస్యం తెలిసిపోయింది..."ఇలా లోపల అనుకుని "ఇంక నేనూ రాసేస్తానులే ఒ కథ"అన్నాను.
"ఎప్పుడు రాస్తావో ఏమో, ఎల్లుండే ఆఖరు రోజు."అంది.
"ఎల్లుండి ఎందుకూ రేపటికే ఇచ్చెయ్యనూ!అప్పుడే శీర్షిక కూడా నిర్ణయం అయిపోయింది.ఏమిటో తెలుసా.."సుధ కథ"-అసలు కిటుకు దొరికిపోయిందిగా?ఇంక కథ రాయడం ఎంతా?"
ఆ సాయంత్రమే ఊరికి బాగా మైలు దూరంలో ప్రశాంతంగా వున్న ఓతోటలోకి వెళ్లి కూర్చున్నా.చుట్టూ కొబ్బరి,అనాస, జామి, మామిడి చెట్లు అన్నీచూడ్డానికి ఎంతో అందంగా వున్నాయి. చిలుకలు జామి పళ్లు కొరికి కింద పడేస్తూ చక్కగా ఒకదానితో ఒకటి వాటి తియ్యని భాషలో మాట్లాడుకుంటున్నాయి.ఉండుండి దూరంగా మామిడిచెట్టు మీంచి కోకిల కూస్తోంది.
ఆహా ఎంత చక్కని వాతావరణం!
కథ రాయడానికి ఎంత అనువైన సామాగ్రి దొరికింది.
నా కథలో కోకిల గురించి కూడా ఇంచక్కా రాయొచ్చును. మహా కవుల్లో ఎవ్వరూ కోకిల గురించి రాయకుండా మానలేదు.
మహా కవులంటే జ్ఞాపకం వచ్చింది. కాళిదాసు ఎంత గొప్పకవి.ఆయన శాకుంతలం, మేఘసందేశం గొప్ప కావ్యాలంటారు. అవి గొప్పవి అయ్యాయంటే బహుశా ఆయన ఆ కావ్యాలను ఇలాంటి తోటలలోనే కూర్చుని రాసి ఉండాలి. నేను కూడా అపర కాళిదాసులా "సుధకథ'ని రాసేస్తా.
మహా బాగా ఎన్నుకున్నాను కదూ ఈ శీర్షిక. ఇటు కావలసిన కోర్సులో 'ధ' వచ్చింది. అటు మా మరదలు సుధ పేరూ వచ్చింది. దాన్ని నాయికను చేసి, నేను ఆ కథ రాయాలి. అందులో అది ఓడిపోయినట్లు, నేను విజయం సాధించినట్లు రాశానా ఇంక చూసుకో- ఎంత ఏడుస్తుందో!
ఏడవ వలసిందే! లేకపోతే తానే గొప్పదాన్నయినట్లు కథలు రాయడం, బహుమతులు సంపాదించడం, అక్కడికి తక్కినవాళ్ళెవళ్ళూ తనకి చాలరన్నట్లు గర్వంగా అందరికేసీ

చూద్దాం. దాని గర్వం ఏంటో ఈసారి తేలిపోవాలి. నా కథ చదివే సరికి దాని తల తిరిగిపోయి గర్వమంతా ఒక్కదెబ్బతో దిగిపోవాలి. లేకపోతే తనొక్కతే మహా కథ రాయగలదనుకుంటోంది. ఆ అనుకోవడం తప్పని నిరూపించాలి. ఏమైనా సరే నే కథరాసి తీరాలి!

ఓ చిత్తు కాగితం తీసి విఘ్నేశ్వరా, సరస్వతీ, వెంకటేశ్వరా అని మూడేసి సార్లు కళ్ళకద్దుకున్నాను. నెల్లాళ్ళ క్రితం కథ రాయబోయే ముందు ఇలా దేవుళ్ళపేర్లు రాసిన జ్ఞాపకం లేదు. అందుకే కథ నడవలేదు. ఏదో ఒక అడ్డంకి వచ్చింది. ఇప్పుడా భయం లేదు. దేవుళ్ల పేర్లు రాసేశానుగా. కథ చకచకా సాగిపోతుంది.

కాగితాలు ఓమారు కుదించి అందంగా బొత్తిపెట్టి, "పిన్" చేశాను. "సుధకథ" అని పెద్ద అక్షరాలతో ఎర్రసిరాలో హెడ్డింగు పెట్టి అందంగా నల్లసిరాతో షేడిచ్చాను. ఆ క్రింద గుండ్రంగా నా పేరు రాశాను. రాయబోయే కథకి అలంకారాన్నీ అందాన్నీ కూర్చేలా ముచ్చటగా తయారైంది హెడ్డింగు.

ఇంక కథే మొదలెట్టాలి. మెదడులో ఎన్నో ఆలోచనలు వున్నాయి. ఎంతో అందమైన ఇతివృత్తం వుంది. చక్కని భాష వుంది. వీటి అన్నిటి సహాయంతో అప్పుడే నా మనస్సులో అత్యద్భుతమైన కథ తయారైపోయింది. నిజంగా నా మనస్సుని చదవగలిగిన పాఠకుడే వుంటే నన్ను ఆకాశానికి ఎత్తి ప్రపంచ కథానికా రచయితల శ్రేణిలో కూర్చోబెట్టి ఉండును.

అంత గొప్ప కథ మెదడులో వుండికూడా కాగితం మీద ఏమీ పెట్టలేకపోతున్నాను. అథవా ఏవో ఒకటి రెండు పంక్తులు రాసినా అవి నా భావంలో వున్న బరువుని తేలేకపోయాయని ఇట్టే తెలిసిపోతోంది, ఇలా ఎందుకు జరుగుతోంది?

ఆలోచించే మెదడు నాది. రాసే చెయ్యి కూడా నాదే. మరి ఈ రెండింటికీ పొంతన ఎందుకు ఉండటం లేదు. బహుశా పెన్ను కొంత కుట్ర చేస్తోందేమో. నెల్లాళ్ళ క్రితమే కదూ బోలెడు డబ్బు పెట్టి కొన్నాను దానిని.

కొంటే మాత్రం ఖరీదు ఐతే ఉంది కానీ కవిత్వం రాసే అలవాటు, సామర్థ్యం ఉండొద్దూ. లక్షలకి లక్షలు డబ్బున్న వాళ్ళల్లో తెలివితేటలు లేని వాళ్ళు ఎంతమంది లేరు. అలాగే ఈ కలమూను.

అందువల్ల ఈ కలం లాభం లేదు. కవిత్వాన్ని రాయడం అలవాటున్న కలాన్ని

సంపాదించాలి. అలాంటి కలం అయితేనా, మన ఆలోచనల్ని చక్కగా కాగితంమీద పెడుతుంది. ఈ ఊర్లో అలాంటి కలమున్నవారు ఎవరున్నారుచెప్మా!

ఆ- ఎవర్నో ఎందుకు? సుధనే అడుగుదాం. నీ పెన్నోమాటివ్వమని. మొన్న తనకి ప్రైజు సంపాదించి పెట్టింది ఆ పెన్నేగా.ఈ అలోచన రావడం తడవుగా అవతల వీధిలో వున్న మా మావయ్యగారింటికి వెళ్లాను.సుధ ఊరెల్లిందిట. మళ్లీ ఆదివారం దాకా రాదట.అలమారంతా వెదికినా దాని కలం కనిపించలేదు.తనతో ఆ వూరు పట్టుకెల్లిందేమో, పొరుగూరు పోయేటప్పుడు కలం ఎందుకు మొద్దుమొహం కాకపోతే? ఇంతకీ నేను కథ పూర్తి చేసే యోగం లేదు తర్వాత సీత ఆఖరిసారిగా కూడా అడిగి వెళ్లి పోయింది.తనలా వెళ్లిపోతూంటే నాకు కళ్లనీళ్లపర్యంతం అయింది.

కొన్నాళ్లయ్యాక ఓరోజున స్టూడెంట్స్‌కి అందరికీ మేగజైన్ కాపీలు ఇస్తారని తెలిసి ఆ రోజున కాలేజీకి శలవు పెట్టి ఇంట్లో తలదాచుకున్నా.సాయంత్రం నా ప్రాణానికి యమములాళ్లలా వచ్చారు ఫ్రెండ్స్.మాయింటికి వనస్తానే "మా కథలు చూశావా"అన్నారు.నాకు బాధా దు:ఖం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. వాటితోపాటు వాళ్లమీద అసహ్యం కూడా వేసింది."నువ్వు చెయ్యలేనిపని మేం ఎంత బాగా చెయ్యగలమో చూశావా"అన్నగర్వరేఖ కూడా నాకా మాటలో గోచరించింది.

అందుకే వెంటనే అన్నాను "ప్చ్..ఆ...వంద కథల్లో మీదొకటి."అని.

నామాట వాళ్లకి గట్టిగా తగిలినట్టుంది."అహ...అలాగేం...అయితే నువ్వొకటి రాయి చూద్దాం.'అన్నారు.

"అదేం బ్రహ్మ విద్యా?"అన్నా.

"బ్రహ్మవిద్యో కాదో!నువ్వు కథ రాసి ఏపెద్ద కథకుడి చేతనయినా ఇది మంచి కథ అనిపించు మేం కథలు రాయడం మానేస్తాం..ఏం?ఇదే పందెం"అన్నారు వాళ్లు.

నాకు వాళ్ల పందెం చూస్తే వళ్లు మండుకొచ్చింది.అంటే వీళ్ల ఉద్దేశ్యం ఏమిటి?నేను కథ అయినా రాయలేనిదాన్ననా?వీళ్లకింతకింతా పొగరణిగించాలనుకున్నా.

"సరే..అలాగే..మనకి మధ్యవర్తి ఎవరు?"అన్నా.

"మొన్న ప్రయిజ్ వచ్చిన సుధ" అన్నారు వాళ్లు.

"నేను ఒప్పుకోను.ప్రముఖ పత్రికల్లో తరుచు కథలు రాసే వెంకట్రావుగారు."

"సరే అలాగే కానియ్యి."అంటూ వాళ్లు వెళ్లిపోయారు.

తర్వాత నేను ఎన్నికథలు చదివానో?కానీ తెల్ల కాగితం మీద కథ మాత్రం కదలడం లేదు.

లాభం లేదు-కథలు రాయడం అలవాటున్న కలం కావాలి.ఓరోజు వెళ్లి సుధ కలం వేరే ఏదో పని వుందని వంకపెట్టి పట్టుకొచ్చా-ఆలోచించకూడదు-ఏది వస్తే అది రాసెయ్యాలి.రాసినది ఏపరిస్థితిలోనూ కొట్టెయ్యకూడదు.అలాగని కలం ఆపకూడదు.కళ్లు మూసుకుని రాసెయ్యడమే పని. ఇలా గట్టిగా ఒట్టు పెట్టుకొని మొండిగా మొదలెట్టేసాను.

ఆశ్చర్యం!

అర్ధరాత్రి దాటకుండా కథ పూర్తయిపోయింది.నా ఆనందానికి అంతు లేదు.నేనుకథ రాసేసాను-ఇకముందు ఎన్నో రాసేయగలను అనే ధైర్యం, ఆనందం నన్ను తేజోవంతం చేసాయి. అదే టైములో సుధ వచ్చింది నా కథ వింది.

" నీ కథ వింటే కథానికా ప్రపంచంలో నీ పేరు నిలుస్తుంది" అంది.

ఏమైనాసరే కథ రాయాలి. నవలలు రాయాలి. రాస్తాను అని ఆనందంతో అరిచాను. దేవాలయంలో గంటలు మ్రోగాయి తథాస్తు అని.

❄❄❄

(జ్యోతి మాసపత్రిక 1964)